# నాన్న ముద్దు

## తాడేపల్లి వజ్రాబాయి

కనీసం రోజుకు పదితడవలైనా తన్ను ముద్దెట్టుకుంటోంది తల్లి. కాని నాన్న తన్నెందుకసలు ముద్దెట్టుకోడో రామానికి అర్థమయ్యేదికాదు. తనతల్లే కాదు వాడలోనివాళ్లందరూ రామాన్ని చూడగానే— "తెల్లదొర వచ్చాడు" అంటూ వాణ్ణెత్తుకొని ఆ చెంపా యీ చెంపా గట్టిగా ముద్దెట్టుకునేవారు. బళ్లో మాస్టార్లందరూ రామాన్ని ముద్దెట్టుకునేవారు. బడిబంట్రోతు రామాన్ని భుజాలమీద కూర్చోబెట్టుకొని, తమాషా తమాషా మాటలు చెబుతూ, సాయంకాలం యింటికి తెచ్చి వదలిపెట్టేవాడు. రంగయ్యమామ్మగారు కూడా రామాన్ని, బడికి పోతూన్నప్పుడల్లా, పట్టుకొని గట్టిగా బుగ్గలు కొరికి, నాజేశ్వరికి "మా బాబు, మా బాబు," అంటూ మిఠాయో నారింగో బలపాలు యిచ్చి బడివరకు పంపించిపోయేవాడు. ఇంత చాకలిమునిమి నాగమ్మకూడా రామాన్ని ముద్దాడకుండా పోయేది కాదు ప్రతినిత్యం. కాని నాన్న మాత్రం రామాన్ని ముద్దెట్టుకోడు. పైగా రుస్సుమంటూ— "ఏదీ నా పాఠం చదివావా? చూచివ్రాత వ్రాశావా?" అని కేకలేస్తూ వుంటాడు. నాన్నకు తనమీద అంతకోపం ఎందుకో రామానికి అర్థం అయ్యేది కాదు.

రామానికి ఏడేళ్లు, దబ్బపండులా వుంటాడు. వాడికళ్ళూ, ముక్కూ చాలా అందంగా వుండి, బుగ్గలు మిసమిసలాడుతూ వుంటాయి. వాడి కంఠం కోకిల కంఠం. వచ్చీరాని పద్యాలూ, పాటలూ, చదవమనడం ఆలస్యం, గబగబా చదివేవాడు, వాడిచేత పద్యాలు చదివించి, విని ఆనందిద్దామని ఆ వూరి వైద్యుడు వడమటి బజారునుంచల్లా, ప్రతిరోజూ వచ్చేవాడు.

తననందరూ ఆవిధంగా ప్రేమిస్తూన్నందుకు రామం సంతోషించేవాడు. కాని వూళ్లోవాళ్లందరు తనని ముద్దులు పెట్టుకున్నా, తల్లి తననెంత గారాబంతో చూచినా, నాన్నగారు తననెందుకు ముద్దెట్టుకోరా అని వాడి అనుమానం.

రామం లేతహృదయంలో ఈ అనుమానం ఆవేదనగా మారింది. నాన్ననే అడిగి తెలుసుకొని యీ ఆవేదనను దూరం జేసుకుందామనుకున్నాడు. కాని నాన్నంటేనే భయం! ఇక అడిగి తెలుసుకోవడమెలా?

ఒకరోజు రామం వాళ్ళ యింటి అరుగుమీద కూర్చున్నాడు. నాన్న చిన్నప్పుడు తననెప్పుడైనా ముద్దెట్టుకున్నాడా లేదా అని ఆలోచించసాగాడు. ఎంత ఆలోచించినా నాన్న తననెప్పుడూ ముద్దెట్టుకొన్నట్లు వాడికి గుర్తురాలేదు.

రామం కళ్లవెంట నీళ్ళు దూకసాగాయి. వెక్కి—వెక్కి— ఏడవడం మొదలెట్టాడు.



"ఆనేవాలె, జానేవాలె"

ఫోటో: సున్న బలరామకృష్ణరావు—విజయవాడ.

దగ్గరలో కాఫీకప్పులు కడుగుతూన్న రామంతల్లి వాడియేడుపు విన్నది. గబగబా పరుగెత్తుకుంటూ వాడిదగ్గరకు వచ్చింది. దగ్గరకు తీసుకుంది. "యేమిట్రా రామం! యెందుకు యేడుస్తున్నావు?" అని అడిగింది లాలిస్తూ.

రామం మరింత గట్టిగా యేడువసాగాడు. తల్లి నోదార్చినకొద్దీ వాడి యేడుపు యెక్కువ కాసాగింది.

అరగంటసేపటికి వాడి యేడుపు సడితగ్గింది. యెక్కిళ్లు పట్టుకున్నాయి.

"ఏంరా నాన్నా! మా బాబు చెప్పరా యెందుకేడ్చావో"" అని తల్లి తలనిమురుతూ వొళ్ళోకి తీసుకొని అడిగింది.

వెక్కిళ్ళమధ్యన, రామం తల్లికి తన హృదయ వేదనను తెలియబర్చాడు.

తల్లి చిరునవ్వు నవ్వింది. వాడి బుగ్గలను పదే పదే ముద్దెట్టుకుంది.

"నా తండ్రీ! యిదా నీ ఆరాటం!" అని రామాన్ని ఎత్తుకుంది. ఆ తల్లికళ్లు జలపూరితములయ్యాయి.

"నాన్న! నీవు రోజూ యెందరాకే పడుకుంటావు. ఈరోజు మీనాన్న వచ్చేవరకు మెలకువతో వుంటే నీ అనుమానం తీరుతుంది," అని తల్లి నవ్వుతూ చెప్పింది.

రాత్రి తొమ్మిదిదాటింది. చదువులు చెప్పడం ముగించుకొని నాన్న వచ్చేవేళ అయిందని రామానికి తల్లి చెప్పింది. రామం దొంగ నిదుర పోసాగాడు.

ఇంతలో రామంనాన్న వచ్చాడు. కోటువిప్పి వంకెకు తగిలించి, బూట్లు విప్పుకొని చక్కగా టేబిలుదగ్గరకు పోయాడు. రామం పుస్తకాలనంచీ తీశాడు. దీపం కాస్త పెద్దదిగా చేశాడు. రామం ఆరోజు వ్రాసిన కాపీలనుచూచాడు. చిరునవ్వు నవ్వుతూ రామం పడుకున్న మంచందగ్గరకు పోయాడు. వాడి రెండువైపులా చేతులనానించి—"మా బంగారు రాజా! యెంత చక్కగా రాశావురా" అని వాడు లేస్తాడో యేమోనన్న భయంతో, నెమ్మదిగా రామంబుగ్గలను ముద్దెట్టుకున్నాడు. చేతులను మెల్లగా తీస్తూ—"మా నాన్నను ఎం. ఏ. చదివిస్తా. వాణ్ణి మహా పండితుణ్ణిచేస్తా" అని అన్నాడు.

రామం అంతా చూస్తూనే వున్నాడు. వాడికి నాన్న అన్న మాటలన్నీ తెలిశాయి. కాని "ఎం. ఏ;" అని "మహాపండితుణ్ణి" అని అన్నమాటలు అర్థం కాలేదు. పోనీ అనుకున్నాడు. మా నాన్నైతే నన్ను ముద్దెట్టుకున్నాడని అపరిమిత ఆనందం పొందాడు. వాడి అమాయికవదనం కలువపువ్వులా వికసించింది, వాడి పెదిమలమీద కన్నని చిరునవ్వు వింతసోయగంతో నాట్యంచేసింది. వాడు సంతోష సాగరాన మునకలేస్తూ తన చిన్ని చిన్ని చేతులతో ముఖాన్ని కప్పుకొని పత్తిగిలాడు. ★


ఆ దగ్గును అణచండి-ఆ గొంతుపుండుకు ఉపశమనం కలిగించి మాన్పండి-రొమ్ము, శ్వాసకోశ బాధలను వెంటనే తొలగించండి



పెప్స్ సేవించండి.

PEPS

జగద్విఖ్యాతి గాంచిన

గొంతు, రొమ్ము టేబ్లెట్లు

మందు అమ్మేవారి అందరివద్దా లభిస్తాయి.



పెప్స్ టేబ్లెట్లు గొంతు, రొమ్ము బాధోపశమన, ఔషధ సారములు కలవి. మీరు పెప్స్‌ను చప్పరించునపుడు ఈ సారములు ఆవిరిఅయి, మీ శ్వాసద్వారా గొంతుకలోనికి, శ్వాసమార్గం, శ్వాసకోశంలోనికి కొనిపోబడుతాయి. ఇలా అవి సరాసరి మిమ్ము బాధించే భాగాలను చేరుకుంటాయి. అందుకే పెప్స్ అంత శక్తివంతమై, జగద్విఖ్యాతిగాంచినవి. పెప్స్ దగ్గులను అణచివేస్తాయి. గొంతుపుండు బాధను ఉపశమింపజేస్తాయి, కఫమును కోసివేసి, శ్వాసబాధను పోగొట్టుతాయి. ఇన్‌ఫ్లుయేంజా, బ్రోంకైటిస్ చికిత్సకు ఇవి అమోఘమైనవి

మద్రాసు సోల్ ఏజెంట్లు: దాదా & కంపెనీ, పార్కుటౌన్, మద్రాసు-3.